

ముగ్గుల పోటీల్లో పాల్గొన్న యువతులు, మహిళలు



ముగ్గుకు తుదిమెరుగులు దిద్దుతున్న మహిళ

చుక్కలు కలిపి.. ముగ్గులు పరిచి

- 'సాక్షి' ఆధ్వర్యంలో నందడిగా ముగ్గుల పోటీలు
- బహుమతుల అందజేత

వనస్థలిపురం/చైతన్యపురి: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని 'సాక్షి' ఆధ్వర్యంలో జయచంద్రా రెడ్డి చారిటబుల్‌ ట్రస్ట్‌ చైర్‌ పర్సన్‌ దేవిరెడ్డి కమలా సుధీర్‌రెడ్డి సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీలు సందడిగా జరిగాయి. వనస్థలిపురం ఎన్‌జీఓస్‌ కాలనీలోని ఛత్రపతి శివాజీ గ్రౌండ్‌లో జరిగిన పోటీల్లో మహిళలు, యువతులు, చిన్నారులు పాల్గొని రంగురంగుల రంగవల్లులు తీర్చిదిద్దారు. ఒక్కొక్కరూ వినూత్నంగా రైతులు, పంట పొలాలు, చెరుకుగడలు, ఎడ్లబండ్లు తదితర అంశాలతో ముగ్గులు తీర్చిదిద్దారు.

విజేతలకు బహుమతులు

అందమైన రంగవల్లులలో పండుగ కాన్సెప్ట్‌, రంగులను దృష్టిలో పెట్టుకుని న్యాయనిర్ణేతలు విజేతలను ఎంపిక చేశారు. మీర్‌పేటకు చెందిన లక్ష్మీప్రసన్న మొదటి విజేత, వనస్థలిపురంకు చెందిన శ్రీచరని, ఆంధ్రకేసరినగర్‌కు చెందిన మమత రెండవ, మూడవ విజేతగా ఎంపికయ్యారు. విజేతలకు సాక్షి ఎల్‌బీనగర్‌ జోన్‌ ఇన్‌చార్జి వర్దెల్లి దశరథ్‌, ప్రముఖ ఆర్కిటెక్చర్‌, ఎల్‌అండ్‌టీ ఉద్యోగిని సుమతి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. వీరితో పాటు నలుగురు కన్సోలేషన్‌ ప్రైజ్‌లు, మిగిలిన వారికి స్పెషల్‌ గిఫ్ట్‌లు అందజేశారు. కార్యక్రమంలో సాక్షి ఎల్‌బీనగర్‌ జోన్‌ బృందం శ్యాంప్రసాద్‌, కృష్ణారెడ్డి, సైదులు, శ్రీనివాస్‌, రాజు, వెంకటేశ్‌యాదవ్‌, పలువురు కాలనీ మహిళలు పాల్గొన్నారు.



మొదటి విజేతకు బహుమతి అందజేస్తున్న దృశ్యం



రెండవ బహుమతి అందుకున్న యువతి



బహుమతులు అందుకున్న మహిళలు

సంతోషంగా ఉంది..



సంక్రాంతి పర్వదినం సందర్భంగా సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజేసేలా ముగ్గు వేశాను. నవధ్యాన్యాలు, చెరుకు గడలు, గొబ్బెమ్మలు, బొమ్మల కొలువు, అమ్మవారి ప్రతిమతో అలంకరించడంతో మొదటి బహుమతి రావటం సంతోషంగా ఉంది. ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసిన సాక్షి బృందానికి కృతజ్ఞతలు

-లక్ష్మి ప్రసన్న, మీర్‌పేట కాలనీ.

'సాక్షి' కి కృతజ్ఞతలు



రోజురోజుకు అంతరించిపోతున్న సంస్కృతి, పండుగలపై అందరికి అవగాహన కలిగేలా ముగ్గుల పోటీలు ఏర్పాటు చేయటం ఆనందంగా ఉంది. మన దేశ సంస్కృతి సంప్రదాయాలు, పండుగలను ఎవరూ మర్చిపోరాదు. ముగ్గుల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేసిన సాక్షి బృందానికి, జయచంద్రా రెడ్డి చారిటబుల్‌ ట్రస్ట్‌ చైర్‌ పర్సన్‌ దేవిరెడ్డి కమలాసుధీర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు

-శ్రీచరణి, వనస్థలిపురం

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

సైదాబాద్‌: చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతు పనుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.
ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.. రవూఫ్‌నగర్‌, జమాల్‌కాలనీ, రాజునగర్‌, అబుబకర్‌ మాస్క్‌, లలితాబాగ్‌, మొయిన్‌బాగ్‌, చిల్డ్రన్‌ జైల్‌, రక్షాపురం టింబర డిపో, అక్బర్‌ పీటీ, మూసారాంబాగ్‌, జ్ఞానదీప్‌ టవర్‌, కృష్ణతులసీ నగర్‌, ఆండాళ్‌ నిలయం, దిల్‌సుఖ్‌నగర్‌ రోడ్‌, ఎస్‌బీహెచ్‌ బ్యాంక్‌, ఇంద్రానగర్‌, రాజరాజేశ్వరీ టెంపుల్‌, ఎస్‌బీఐ కాలనీ పార్క్‌, డీబీఆర్‌ డయాగ్నస్టిక్‌ సెంటర్‌, తనిష్క్‌ జువెల్లర్స్‌, నోబుల్‌ డిగ్రీ కాలేజ్‌, అక్బర్‌బాగ్‌, పల్టన్‌ చౌరస్తా, దయానంద్‌ నగర్‌, ఆనంద్‌నగర్‌, మలక్‌పేట పరిసర ప్రాంతాలు.
మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 వరకు.. అరుంధతి కాలనీ, జమాల కాలనీ, మొయిన్‌బాగ్‌, ఫతేషా నగర్‌, ఏపీఏయూ కాలనీ, గడ్డిఅన్నారం, వెంకటేశ్వర కామర్స్‌ కాలేజ్‌, తిరుమలహిల్స్‌, ఇండస్‌ ల్యాండ్‌ బ్యాంక్‌, వాణిజ్యవిహార్‌, నలందా కాలేజ్‌, బిగ్‌-సీ, ఎల్‌ఐసీ కాలనీ, న్యూ సైదాబాద్‌ పీఎస్‌, గ్రీన్‌ల్యాండ్‌ కాలనీ, ఫరా కాలనీ, ఎల్‌సీహెచ్‌ కాలనీ, వాటర్‌ట్యాంక్‌, పూసలబస్తీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్‌ ఉండదన్నారు.

ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలి



కిరణ్‌తో ప్రమాణం చేయిస్తున్న లక్ష్మీనారాయణ

సైదాబాద్‌: ఆర్యవైశ్యులు రాజకీయంగానూ ఎదగాలని ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు. చంపాపేట్‌లోని సామ సరస్వతి గార్డెన్స్‌లో రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు ప్రకాష్‌గౌడ్‌, కసిరెడ్డి నారాయణ రెడ్డి, సూర్యనారాయణ, శంకర్‌, ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్‌గుప్తా, ఆర్యవైశ్య కార్పొరేషన్‌ చైర్మన్‌ కల్వ సుజాత, రాష్ట్ర రోడ్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ మల్‌రెడ్డి రాంరెడ్డి హాజరయ్యారు. రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన అధ్యక్షుడు గందె సురేష్‌, ప్రధాన కార్యదర్శి బిల్లకంటి కిరణ్‌కుమార్‌ సహా ఇతర సభ్యులతో అమరవాది లక్ష్మీనారాయణ ప్రమాణం చేయించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఆర్థిక, సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహించే ఆర్యవైశ్యులు రాజకీయాల్లోనూ క్రియాశీలకంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నూతన కార్యవర్గం ప్రతినిధులు బద్రీనాథ్‌గుప్తా, రమాదేవి, రాధిక, విజయలక్ష్మి, మహేష్‌ గుప్తా, నందకిషోర్‌, నగేష్‌ పాల్గొన్నారు.

క్రీడాకారులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



మలక్‌పేట: ప్రభుత్వం క్రీడాకారులకు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్‌ బలాల అన్నారు. మూసారంబాగ్‌ యూత్‌ బ్రిగేడ్‌ ఆధ్వర్యంలో శనివారం రాత్రి బాలదానమ్మ కమ్యూనిటీహాల్‌ ఆవరణలో జరిగిన బాడీ బిల్డింగ్‌ పోటీలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు 'గోల్డెన్‌ మెన్‌ ఆఫ్‌ది ఐ' అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్‌ గాజుల శివప్రసాద్‌, మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్‌ మెట్టు సాయికుమార్‌, గ్రంథాలయ పరిషత్‌ చైర్మన్‌ డాక్టర్‌ రియాజ్‌, నాయకులు బొక్క మధుసూదన్‌రెడ్డి, గౌర శ్యామ్‌రావు, షేక్‌ అక్బర్‌, ముప్పిడి బల్వంత్‌, ధన్వంత్‌, రంజిత్‌కుమార్‌ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలి



వస్త్ర సంచుల పంపిణీ చేస్తున్న ఎస్సై రవినాయక్‌

వనస్థలిపురం: శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులకు ఆదివారం సాహెబ్‌నగర్‌లోని త్రినేత్ర ఆంజనేయస్వామి దేవాలయం వద్ద జాగృతి అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో వస్త్ర సంచులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వనస్థలిపురం ఎస్సై రవినాయక్‌ మాట్లాడుతూ.. ఏక వినియోగ ప్లాస్టిక్‌ నియంత్రణలో శబరిమల అయ్యప్ప దేవాలయ కమిటీని మన దేవాలయాలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కాలుష్యం విపరీతంగా పెరిగిపోవడంతో ప్రాణాంతక వ్యాధులు తెచ్చే కొత్త వైరస్‌లు పుట్టుకొస్తున్నాయని అన్నారు. ప్రకృతి పరిరక్షణతోనే మన ఆరోగ్యం ముడిపడి ఉందని పర్యావరణ పరిరక్షణకు జాగృతి అభ్యుదయ సంఘం చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు భావన శ్రీనివాస్‌, గురుస్వాములు పృథ్వీరాజ్‌, నాగరాజు, దాస్‌, సురేష్‌, ధన్‌పాల్‌, రాకేష్‌, అయ్యప్పలు సాయి, ఉపేందర్‌, దిలీప్‌ పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్‌: విద్యుత్‌ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్‌ డివిజనల్‌ ఇంజినీర్‌ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ పుష్పాగార్డెన్స్‌ ఫీడర్‌ పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు. 11కేవీ డెంటల్‌ కళాశాల ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంట వరకు. 11కేవీ సరూర్‌నగర్‌, శారదానగర్‌ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు. 11కేవీ చిత్రా లేఅవుట్‌, సాయికాలనీ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తామని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్‌: సరూర్‌నగర్‌, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.13, వంకాయ రూ.23, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్‌ రూ.13, క్యాబేజీ రూ.11, క్యారెట్‌ రూ.35, దొండ రూ.45, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.39, గోకర కాయ రూ.28, దోసకాయ రూ.21, సొరకాయ రూ11, చిక్కుడుకాయ రూ.40, చామగడ్డ రూ.37, మునగ రూ.105, చిలుకడ దుంప రూ.55, బీట్‌రూట్‌ రూ.35, కీర రూ.23, బీన్స్‌ రూ.40, క్యాప్సికమ్‌ రూ.41. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

చెట్ల నరికివేతపై చర్యలు తీసుకోవాలి

హస్తినాపురం: నాగార్జున సాగర్‌ రోడ్డుపై హస్తినాపురం బీఎన్‌రెడ్డినగర్‌ చౌరస్తా వద్ద చెట్లను నరికివేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని పంచాయతీ రాజ్‌ టీచర్స్‌కాలనీ ట్రీప్రొటక్షన్‌ కమిటీ కోఆర్డినేటర్‌ సన్నీ హెరాక్లీయస్‌ అన్నారు. చెట్లను నరుకుతున్న వారిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి చెట్లను తొలగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సామాజిక విలువలను పెంపొందించుకోవాలి

హుడాకాంప్లెక్స్‌: విద్యార్థి దశలోనే సామాజిక విలువలు పెంపొందించుకోవాలని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. సరూర్‌నగర్‌లోని బీసీ వెల్ఫేర్‌ బాలికల హాస్టల్‌లో లీడ్‌ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన స్కిల్‌ డెవలప్‌మెంట్‌ కార్యక్రమానికి కేఎల్లార్‌ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు పరీక్షల్లో వెనుకబడినా నిరాశ చెందకుండా ప్రయత్నించి విజయం సాధించాలని సూచించారు. లీడ్‌ ఇండియా ప్రోగ్రాం ద్వారా విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నామన్నారు. ఏదైనా సాధించాలంటే తపన, పట్టుదల, నమ్మకం ఉండాలని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

నాగోలు: కొత్తపేట డివిజన్‌ భరత్‌నగర్‌ కాలనీ ఫేస్‌-1 కాలనీలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కార్పొరేటర్‌ పవన్‌కుమార్‌ పేర్కొన్నారు. కాలనీ అసోసియేషన్‌ సభ్యులు ఆదివారం కార్పొరేటర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు మామిడి రామచందర్‌ మాట్లాడుతూ.. భరత్‌నగర్‌ ఫేస్‌-1లో సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్‌, వీధి దీపాల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్‌ను కోరారు.



వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

బీఆర్‌ఎస్‌ పటిష్టతకు కృషి చేయాలి



ఎమ్మెల్యేతో బీఆర్‌ఎస్‌ నాయకులు

దిల్‌సుఖ్‌నగర్‌: ఆర్‌కేపురం డివిజన్‌లో బీఆర్‌ఎస్‌ పటిష్టతకు కృషి చేయాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి సూచించారు. ఆదివారం ఆమెను పలువురు బీఆర్‌ఎస్‌ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలోని రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రైతుబంధు ఇచ్చిందని కాంగ్రెస్‌ ప్రభుత్వం ఈ పథకాన్ని ఎత్తివేయాలని చూస్తుందన్నారు. ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తులను ఏం చేశారని, రైతులతో మళ్లీ దరఖాస్తు చేసుకోమని అనడం సరికాదన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మురుకుంట్ల అరవింద్‌శర్మ, నగేష్‌, మురుకుంట్ల విజయ భారతి ఉన్నారు.

కాలనీ అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కాలనీ వాసులు

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్‌ అభ్యుదయనగర్‌ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎల్‌బీనగర్‌ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్‌ బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు చింతల రవికుమార్‌ ఆధ్వర్యంలో అభ్యుదయనగర్‌ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి కాలనీ సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. కాలనీల్లో ధ్వంసమైన రోడ్ల స్థానంలో నూతన రోడ్లు వేయాలని కోరారు. చిన్నపిల్లల కోసం ప్లే గ్రౌండ్‌ను నిర్మించాలని వినతిలో కోరారు. ఎమ్మెల్యేను కలిసి వారిలో గంగారెడ్డి, ఆనంద్‌రాజ్‌ తదితరులు ఉన్నారు.

కాలనీలో కార్పొరేటర్‌ పర్యటన

ఎల్‌బీనగర్‌: డివిజన్‌ పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్‌ పరిధిలోని బృందావన్‌ మెడోస్‌కాలనీలో ఆదివారం ఆయన కాలనీవాసులతో కలిసి పర్యటించి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్పొరేటర్‌ వెంట శశికాంత్‌, జగన్‌మోహన్‌చారి, వేణు, ప్రభాకర్‌, రాఘవేందర్‌, రమణ, సందీప్‌, వెంకట్‌, ప్రియా, మాలతి, సైదమ్మ అరుణ, శివశంకర్‌, రమేశ్‌, సురేందర్‌ ఉన్నారు.



కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్‌ లచ్చిరెడ్డి

చైనా మాంజా విక్రేత రిమాండ్‌

చాదర్‌ఘాట్‌: నిషేధిత చైనా మాంజా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన ఘటన చాదర్‌ఘాట్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై భరత్‌ వివరాల ప్రకారం... ఓల్డ్‌మలక్‌పేటకు చెందిన అభినయ్‌ (24) చైనా మాంజా అమ్ముతుండగా గుర్తించిన సౌత్‌జోన్‌ టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు అదుపులోకి తీసుకొని చాదర్‌ఘాట్‌ పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

విక్రేతలపై చర్యలు తీసుకోవాలి..

చైతన్యపురి: చైనా మాంజాలతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని విశ్వ హిందూ పరిషత్‌ కార్యదర్శి కీర్తిగారి అనంతాచారి సరూర్‌నగర్‌ ఇన్‌స్పెక్టర్‌ సైదిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. చైనా మాంజాతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయని, గతేడాది ఆర్మీ జవాను చైనా మాంజా తగిలి చనిపోవటం జరిగిందని దిల్‌సుఖ్‌నగర్‌ ప్రాంతంలో పలు ప్రమాదాలు జరిగాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో గోవర్ధనాచారి, రవిచారి, శ్రీనివాస్‌, సునీల్‌ ఉన్నారు.



ఇన్‌స్పెక్టర్‌ సైదిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న వీహెచ్‌పీ నాయకులు


అన్నదానం



అన్నం వడ్డిస్తున్న రూపాదేవి

మలక్‌పేట: మూసారంబాగ్‌ ఆండాళ్‌ నిలయంలో ధనుర్మాస మహోత్సవ తిరుప్పావై ప్రవచనోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆండాళ్‌ నిలయంలో ఆదివారం 'ఏత్తకలంగళ్‌' రిందాదేవి తిరునక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. రిందాదేవి విగ్రహానికి పుష్పాభిషేకం చేశారు. చింబాపట్టణం జగన్మోహనాచార్య స్వామి భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు లక్ష్మీదేవి, రూపాదేవి అన్నదానం చేశారు.

యువకుడి అదృశ్యం



ఆనంద్‌

హయత్‌నగర్‌: ఓ ఫౌండేషన్‌లో వృత్తి నైపుణ్య శిక్షణ పొందుతున్న యువకుడు అదృశ్యమైన ఘటన హయత్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం అనాజ్‌పూర్‌ గ్రామానికి చెందిన ఏర్పుల రంగయ్య, ఎర్పుల ఆనంద్‌(16)ను దత్తత తీసుకున్నాడు. ఆనంద్‌కు మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో పెద్దఅంబర్‌పేట్‌ సూర్యవంశి కాలనీలో ఉన్న చిల్డ్రన్‌ ఆఫ్‌ దక్కన్‌ ఫౌండేషన్‌లో చేర్పించి వృత్తి నైపుణ్య శిక్షణ ఇప్పిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఆనంద్‌ అక్కడి నుంచి పారిపోయాడు. ఫౌండేషన్‌ నిర్వాహకులు మల్కయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.



పురస్కారం అందుకుంటున్న గీతారెడ్డి

పురస్కారం ప్రదానం

మన్సూరాబాద్‌: అంతార్జాతీయ మానవ హక్కుల జాతీయ అధ్యక్షురాలు (మహిళా విభాగం)డి.గీతా రెడ్డి పండుగ సాయన్న రాష్ట్రస్థాయి సేవా పురస్కారం అందుకున్నారు. పండుగ సాయన్న స్మారక ట్రస్ట్‌ ఆధ్వర్యంలో నగరంలోని బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోదండరామ్‌ పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో శివరామచంద్రన్‌, రమేష్‌ ముదిరాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక నేత అనంతయ్యకు..



అనంతయ్యకు అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

మలక్‌పేట: జాతీయ భవన నిర్మాణ కార్మికుల సేవా సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ అధ్యక్షుడు, బ్యాగరి అనంతయ్యకు 'పండుగ సాయన్న స్మారక అవార్డు' దక్కింది. పండుగ సాయన్న స్మారక ట్రస్ట్‌ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు ఆయనకు అవార్డు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా అనంతయ్య మాట్లాడుతూ.. ఈ పురస్కారం తనపై బాధ్యతను మరింతగా పెంచిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసంఘటిత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

సైదాబాద్‌: మానసికోల్లాసానికి క్రీడలు దోహదపడుతాయని వాలీబాల్‌ క్రీడాకారుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సైదాబాద్‌ డివిజన్‌ ఏపీఏయూ కాలనీ మైదానంలో ఇంటర్నేషనల్‌ వాకర్స్‌ క్లబ్‌ మలక్‌పేట శాఖ అధ్యక్షుడు మడిగెల విజయ్‌భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వాకర్స్‌ కోసం నిర్వహించిన క్రీడాపోటీల ప్రారంభంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నిత్యం నడక సాధనతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. క్రీడా పోటీల్లో ఇంటర్నేషనల్‌ వాకర్స్‌ క్లబ్‌ సభ్యులు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్‌ వాకర్స్‌ క్లబ్‌ ప్రతినిధి హరినాథ్‌, జిట్టా సురేందర్‌రెడ్డి, హరిగౌడ్‌, హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.



క్రీడా పోటీల్లో పాల్గొన్న వాకర్స్‌ క్లబ్‌ ప్రతినిధులు